# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 152 | విశాఖపట్నం | 4-3-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 152 | VISAKHAPATNAM | 4-3-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
9516171797, 9491286902




5లో

## పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరం

ఇరాన్‌పై దాడులను మరింత పెంచుతామన్న ట్రంప్

## థైరాయిడ్ ఎందుకు వస్తుంది?



6లో



7లో

## నత్తనడకన బలహీన వర్గాల గృహ నిర్మాణాలు!

గడువు దాటినా.. లక్ష్యాన్ని చేరుకోని వైనం

# ముగిసిన చంద్రబాబు, పవన్ భేటీ..



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య ఉండవల్లిలోని సీఎం నివాసంలో మంగళవారం రెండు గంటల పాటు కీలక భేటీ జరిగింది. మంగళగిరిలో 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం' సందర్భంగా జరిగిన అటవీ శాఖ 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకుని పవన్ నేరుగా సీఎం వద్దకు వెళ్లారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో 'జల్ జీవన్ మిషన్' అమలుపై ముఖ్యమంత్రితో పవన్ చర్చించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు తలసరి 55 లీటర్ల స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని వీరు నిర్ణయించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈ మిషన్ గడువును 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కేవలం నీటి సరఫరానే కాకుండా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, నిర్వహణపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోల అంశం కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీటీడీ పవిత్రతను కాపాడటంతో పాటు, వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న రాజకీయ కోణాలను వీరు విశ్లేషించినట్లు తెలుస్తోంది. అలాగే టీటీడీ ప్రసాదాల్లో నాణ్యత, భక్తుల సౌకర్యాలపై కూడా సమీక్షించారు.

### బాలయోగి వర్ధంతి సందర్భంగా
## లోకేశ్ నివాళులు



**అమరావతి, పతాకం న్యూస్:** లోక్‌సభ తొలి దళిత స్పీకర్, టీడీపీ సీనియర్ నాయకుడు జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నివాళులర్పించారు. సామాన్య కుటుంబంలో జన్మించి లోక్‌సభ సభాపతిగా ఎదిగి.. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. 'లోక్‌సభ తొలి దళిత స్పీకర్, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నాను. ఆయన.. దళితులు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్ని శలు కృషిచేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. దేశానికి, రాష్ట్రానికి వారు అందించిన సేవలు చిరస్మరణీయమని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

### టీటీడీ ఛైర్మన్ పదవికి బీఆర్ నాయుడు
# రాజీనామా చేయాలి: రోజా



**అమరావతి, పతాకం న్యూస్:** భగవద్గీతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ నాయుడు టీటీడీ ఛైర్మన్ పదవికి అనర్హుడని మాజీ మంత్రి ఆర్కే రోజా ధ్వజమెత్తారు. టీటీడీ ఛైర్మన్ పదవికి బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం నగరిలో నిర్వహించిన ప్రెస్మీట్లో రోజా మాట్లాడుతూ.. ' ఇందు పరువు తీసింది బీఆర్ నాయుడే. నిజం లేక పోతే బాబు, లోకేష్, పవన్‌లకు ఇందు ఎందుకు లేఖ రాశారు. బీఆర్ నాయుడికి మహిళలంటే గౌర వం లేదు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వీడి యోలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. దేశంలో ఏ ఆలయ ఛైర్మన్కు సంబంధించిన వీడియోలు ఇలా బయటపడిన దాఖలాలు లేవు. ఛైర్మన్ హుందాగా, రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన బాధ్యతను బీఆర్ నాయుడు పాటిం చలేదు. టీటీడీలో ఆవుల మరణాలు, తొక్కిసలాట ఘటనలు ఛైర్మన్ వైఫల్యమే. లడ్డూ వివాదంలో సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు జరిగినప్పటికీ మళ్లీ ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం అనవసరం. ఇందాపూర్ డెయిరీకి నెయ్యి సరఫరా బాధ్యతలు అధిక ధరలకు కట్టబెట్టడంపై అనుమానాలు ఉన్నాయి. చంద్రబాబు, పవన్ ఈ అంశంపై మౌనం వహించడం బాధాకరం' అని రోజా విమర్శించారు.

## 250 విమానాలు రద్దు

2లో



## అంగన్వాడీల అరెస్టులు, నిర్బంధం..
### రాష్ట్ర వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనాగ్రహం





**విజయవాడ, పతాకం న్యూస్:** వేతనాలు పెంచాలని కోరుతూ శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలపై ధమనకాండను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనాగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే అక్రమ అరెస్టులు చేస్తారా? అంటూ అంగన్వాడీలు మండిపడ్డారు. వేతనాలు పెంచకుండా ప్రభుత్వం అంగన్వాడీల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.



# హోర్ముజ్ జలసంధి మూసివేత

## భారత్‌కు ఇంధన ముప్పు?.. నిల్వలు ఎన్ని రోజులు సరిపోతాయో!

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రపంచ ఇంధనానికి జీవనాడి అయిన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన నేపథ్యంలో, ఆ ప్రభావం భారత్‌తోపాటు, ప్రపంచ దేశాలపై తీవ్రంగా పడనుంది. కెప్లర్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం భారత్? వద్ద సుమారు 100 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఇవి స్టోరేజ్ ట్యాంకులు, భూగర్భ రిజర్వుల్లో, ఇండియాకు విదేశాల నుంచి వస్తున్న చమురు నౌకల్లో ఉన్నాయి. ఇవి కేవలం 40-45 రోజుల అవసరాలకు మాత్రమే సరిపోతాయి. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం వాడే చమురులో దాదాపు 88 శాతాన్ని దిగుమతి చేసుకుంటోంది. పెట్రోల్, డీజిల్ తయారీకి అవసరమైన ముడి చమురులో 50 శాతానికిపైగా పశ్చిమాసియా దేశాల నుంచి వస్తుంది. ఇరాన్ తాజాగా హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో, భారత్‌కు ముడి చమురు వచ్చేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. 'హోర్ముజ్ జలసంధి మూసివేత వల్ల మొదట కార్గో లోడింగ్‌పై ప్రభావం పడుతుంది. అయినప్పటికీ రిఫైనర్లు సాధారణంగా వాణిజ్య నిల్వలను నిర్వహిస్తారు. ఇప్పటికే సముద్ర మార్గంలో ఉన్న నౌకలు ఆయా దేశాలకు చేరుతూనే ఉంటాయి. ఇది కొంతమేర స్వల్పకాలిక వెసులుబాటును ఇస్తుంది. అయితే ముడి చమురు సరఫరాకు దీర్ఘకాల అంతరాయం ఏర్పడితే, దిగుమతి ఖర్చులు భారీగా పెరుగుతాయి. ఫ్రైట్ ఛార్జీల భారం పడుతుంది.

'మంగళూరు, పడూరు, విశాఖపట్నంలో వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్లు (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## ఎండలు..

వేసవి రాకముందే రాష్ట్రంలో ఎండలు మండుతున్న తీరు చర్చనీయాంశంగా మారింది. గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో 35 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలు రాయలసీమ జిల్లాలతో పాటు, కోస్తా జిల్లాల్లో కూడా 35 నుండి 36 డిగ్రీల గరిష్ట ఉషోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసినప్పటికీ అత్యధిక జిల్లాల్లో సూర్య ప్రతాపమే కొనసాగింది. వాతావరణ శాఖ జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం ఈ ఏడాది మార్చి నెలలో వేసవి కాలం ప్రారంభమై మే నెలాఖరు వరకు కొనసాగాల్సి ఉండగా ఫిబ్రవరి నెలలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళనకరం. కొన్ని సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా వాతావరణంలో ఈ తరహా మార్పులు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం 2024 సంవత్సరం భారతదేశ చరిత్రలో అత్యంత వేడి నమోదైన సంవత్సరాల్లో ఒకటిగా నిలిచింది. ఆ సంవత్సరం మన రాష్ట్ర సగటు ఉష్ణోగ్రత సుమారు 1 నుండి 1.5 డిగ్రీల వరకు అధికంగా నమోదైనట్లు వాతావరణ విభాగ విశ్లేషణలు చెబుతున్నాయి. గత ఏడాది (2025)లో అనంతపురం, కర్నూలు, నంద్యాల, గుంటూరు జిల్లాలో 45 నుండి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే, మార్చి నెల మధ్యలోనో, ఏప్రిల్ ప్రారంభం నుండో మండే ఎండలు ఈ సారి ఫిబ్రవరిలోనే ప్రారంభం కావడం ముందస్తు హెచ్చరికగా భావించక తప్పదు. అయితే, ఇది కేవలం ఒకటి, రెండు సంవత్సరాల్లో చోటుచేసుకున్న వైపరీత్యమనుకుంటే పొరపాటు. ఒక అధ్యయనం ప్రకారం 2010 తరువాత ప్రతి ఐదు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతోంది. వడ గాలుల తీవ్రత, అవి కొనసాగే కాలవ్యవధి పెరుగుతోంది. ఆ క్రమంలోనే 2024 వేసవిలో దేశవ్యాప్తంగా వడదెబ్బ కేసులు గణనీయంగా పెరిగాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాత్కాలిక గణాంకాల ప్రకారం, దేశ వ్యాప్తంగా వడదెబ్బ కారణంగా వందల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. మన రాష్ట్రంలో కూడా గత వేసవిలో వడదెబ్బ కారణంగా రెండు డజన్లకు పైగా మరణాలు నమోదైనట్లు సమాచారం. ఇటువంటి ఉత్పాతాలు కేవలం వైద్య, ఆరోగ్య పరమైన అంశాలనే కాదు. సామాజిక అసమానతల్ని కూడా బట్టబయలు చేస్తాయి. నిర్మాణరంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి శ్రామికులు, రోడ్లపై చిన్నా చితక పనులు చేస్తూ పొట్ట పోసుకునే కష్టజీవులే వడదెబ్బ, వేడి గాలుల బాధితుల్లో అధిక సంఖ్యలో ఉండటం ఈ వాస్తవాన్నే విదితం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నమోదుకాని మరణాలు, చికిత్సకు నోచుకోని బాధితుల సంఖ్య ఇంకా హెచ్చుగా ఉంటుంది. ఈ గణాంకాలన్నింటిని సేకరిస్తే తప్ప అత్యధిక ఉష్ణోగ్రతల వాస్తవ ప్రభావం ఎంత? అసమానతల గాఢత ఎంత అన్నది స్పష్టం కాదు. ఉష్ణోగ్రతలు పెరగడం, ఫలితంగా వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకోవడమన్నది ఇక ఎంతమాత్రం భవిష్యత్ కాలపు హెచ్చరిక కాదు. వర్తమానపు వాస్తవంగా ఆ విపత్తు మన కళ్లముందే నిలుస్తోంది. దీనిని అర్థం చేసుకోవడం నివారణ చర్యలు తీసుకోవడం ఇప్పుడు తప్పనిసరిగా మారిన ఒక సామాజిక బాధ్యత. ఉష్ణోగ్రతలు ఏటికేడాది వరుసగా రికార్డులు బద్దలు కొడుతూ, మరణాల సంఖ్య పెరుగుతుండగా, పాలనా వ్యవస్థలు మొక్కుబడి చర్యలకు పరిమితం కావడం ఇక ఏమాత్రపు క్షమార్హం కాదు. పెరిగే ఎండలు ప్రజలకు తాగునీరు, సాగునీటి అవసరాల పైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. భూగర్భజలాలు తీవ్రంగా క్షీణించడం, విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. వీటిని దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం తక్షణం వేసవి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి. ఈ యాక్షన్ ప్లాన్లు కాగితాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయి వరకు అమలయ్యేలా చూడాలి. ముందస్తు హెచ్చరికలు, పనివేళల్లో మార్పులు, తాగునీటిని అందుబాటులో ఉంచడం, గ్రీన్ కవర్ పెంచడం, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు వంటి చర్యలు చిత్తశుద్ధితో అమలు చేస్తే ప్రాణ నష్టం గణనీయంగా తగ్గుతుందన్నది అనేక దేశాల్లో, కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికే నిరూపితమైన సత్యం. ప్రభుత్వం ఈ విషయమై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది. ప్రతి సంవత్సరం చోటుచేసుకుంటున్న ఈ వైపరీత్యాన్ని నిరక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు.

### అరబ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడులు..

## గల్ఫ్ దేశాల మౌనం వెనుక మర్మమేంటి?



**దుబాయ్:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానంతరం పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులు దుబాయ్, అబుదాబి వంటి నగరాలపై పడుతున్నప్పటికీ, సౌదీ అరేబియా, యూఏఈ వంటి శక్తిమంతమైన గల్ఫ్ దేశాలు ఎదురుదాడికి దిగకుండా మౌనం పాటిస్తున్నాయి. ఈ వ్యూహాత్మక వైఖరి వెనుక బలమైన ఆర్థిక, రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గల్ఫ్ దేశాలు ప్రస్తుతం తమ ఆర్థిక వ్యవస్థలను కేవలం చమురుపై ఆధారపడకుండా పర్యాటకం, వాణిజ్య కేంద్రాలుగా మార్చుకుంటున్నాయి. ఇలాంటి సమయంలో ఇరాన్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి దిగితే, దశాబ్దాలుగా నిర్మించుకున్న అభివృద్ధి క్షణాల్లో కుప్పకూలుతుందని ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే దుబాయ్ విమానాశ్రయం సమీపంలో దాడులు జరగడంతో పెట్టుబడిదారుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. యుద్ధం మొదలైతే తమ చమురు క్షేత్రాలు, ఓడరేవులే ప్రధాన లక్ష్యంగా మారతాయని అరబ్ పాలకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, 'ముస్లిం ఉమ్మా' (ఐక్యత) సెంటిమెంట్ కూడా వారిని నిలువరిస్తోంది. ఇరాన్ షియా దేశమైనప్పటికీ, అది ప్రస్తుతం ఇజ్రాయెల్, అమెరికాలను వ్యతిరేకిస్తోంది. ఈ తరుణంలో ఇరాన్‌పై దాడి చేస్తే, తాము ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్నామనే సందేశం వెళ్తుందని అరబ్ దేశాలు భావిస్తున్నాయి. ఇది సొంత ప్రజల్లోనే తీవ్ర వ్యతిరేకతకు దారితీసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ఇరాన్ ఉచ్చులో చిక్కుకోకూడదని కూడా గల్ఫ్ దేశాలు భావిస్తున్నాయి. తమను రెచ్చగొట్టి యుద్ధంలోకి లాగడం ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచాలన్నది ఇరాన్ వ్యూహంగా అనుమానిస్తున్నాయి. అందుకే, క్షిపణి దాడులను తమ గగనతల రక్షణ వ్యవస్థలతోనే అడ్డుకుంటున్నాయి తప్ప, తిరిగి ఇరాన్ భూభాగంపై దాడులకు దిగడం లేదు. ఈ వివాదాన్ని ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా మధ్యకే పరిమితం చేయాలన్నది వారి ఆలోచనగా కనిపిస్తోంది.

## 250 విమానాలు రద్దు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా సుమారు 250కి పైగా విమానాలు రద్దయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా ముంబయి, బెంగళూరు మరియు చెన్నై విమానాశ్రయాల్లో సుమారు 250కి పైగా విమానాలు రద్దయ్యాయని అధికారులు మంగళవారం తెలిపారు. అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య విమానయాన సంస్థలు విమానాలను రద్దు చేస్తున్న సంగతి తెలిసిందే. వరుసగా నాలుగవ రోజు కూడా విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడినట్లు అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో 80 విమానాలు రద్దు చేయగా, ముంబయి విమానాశ్రయంలో 107 సర్వీసులు రద్దైనట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా బెంగళూరు విమానాశ్రయంలో సుమారు 42 సర్వీసులు, చెన్నై నుండి 30 విమానాలు రద్దయ్యాయి. ఫిబ్రవరి 28 పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తినప్పటి నుండి, భారతవిమానయాన సంస్థలు గత మూడు రోజుల్లో 1,117 అంతర్జాతీయ విమానాలను రద్దు చేశాయి.

## చంద్రగ్రహణం.. రాష్ట్రంలో ఆలయాల మూసివేత



**అమరావతి, పతాకం న్యూస్:** చంద్రగ్రహణం కారణంగా రాష్ట్రంలోని ఆలయాలను మూసివేశారు. తిరుమల వేంకటేశ్వరుని ఆలయాన్ని టీటీడీ అధికారులు ఉదయం 9 గంటలకు మూసివేశారు. గర్భాలయంతో పాటు మహాద్వారం తలుపులకు తాళాలు వేశారు. తిరుమల అన్నవితరణ కేంద్రాల్లో ప్రసాదాల తయారీ కూడా నిలిపేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా 40 వేల పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటల 47 నిమిషాలకు చంద్రగ్రహణం ముగిశాక ఆలయంలో శుద్ధి, పుణ్యాహవచనం కార్యక్రమం నిర్వహించి తర్వాత దర్శనాలకు అనుమతిస్తారు. తిరిగి రేపు సర్వదర్శన టోకెన్లు జారీని ప్రారంభిస్తామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి వెల్లడించారు. ఇవాళ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖల స్వీకరణ, ఆర్జిత సేవల టికెట్ల జారీని టీటీడీ రద్దు చేసింది. తిరుపతిలో సర్వ దర్శన టోకెన్ల జారీని ఇప్పటికే ఆపేసింది. తిరిగి రేపు సర్వదర్శన టోకెన్లు జారీని ప్రారంభించనుంది. గ్రహణ ఘడియల వేళ మూతపడ్డ టీటీడీ స్థానిక ఆలయాలు: చంద్రగ్రహణ ప్రభావంతో తిరుపతిలోని స్థానిక ఆలయాలు మూతపడ్డాయి. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి, శ్రీ కోదండరామస్వామి వారి ఆలయాలను అధికారులు మూసివేశారు. శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ దర్శనాలు నిలిపివేశారు. గ్రహణం వీడిన తర్వాత ఆలయాల తలుపులు తెరిచి ఆలయశుద్ధి, కైంకర్యాలు నిర్వహిస్తారు. ఇంద్రకీలాద్రిపై దుర్గగుడికి కవాట బంధనం: విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గగుడిని అధికారులు మూసివేశారు. ఆలయంలో అమ్మవారికి నివేదన అనంతరం ప్రధానాలయంతో పాటు ఉపాలయాలకు ఆలయ అర్చకులు, సిబ్బంది తాళాలు వేశారు.

## ఏనుగుల సమస్యను పరిష్కరించాం: పవన్



**మంగళగిరి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించామని ఎపి డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎపి ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవంను మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ .... అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు అని చెప్పారు. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. అనంతరం సిఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. 'హనుమాన్' కార్యక్రమం ముగియగానే నేరుగా ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవులు తదితర అంశాలపై చంద్రబాబుతో పవన్ చర్చించే అవకాశముంది.

### అవయవదానంలో రాష్ట్రానికి

## ఆరో స్థానం: సత్యకుమార్




**అమరావతి, పతాకం న్యూస్:** అవయవదానంలో రాష్ట్రానికి ఆరో స్థానం లభించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా అవయవదానాల్లో ఏపీ ఆరో స్థానంలో నిలిచిందన్నారు. ఈరోజు(మంగళవారం) జీవన్‌దాన్ కార్యకలాపాలపై మంత్రి సత్యకుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలల్లో రాష్ట్రంలో 64 మందికి కొత్త జీవితం లభించిందని అన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది అవయవదానంపై స్పందన గణనీయంగా పెరిగిందన్నారు. యువత, మధ్య వయస్సు వారిలో అవయవదానం పట్ల అవగాహన పెరుగుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. అవయవాల కోసం వేచి ఉన్న 5000 మందిలో 50 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారని మంత్రి వెల్లడించారు. గత ఏడాది 301 అవయవమార్పుడులు జరిగాయన్నారు. 93 మంది బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి అవయవాలు సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్సల సంఖ్యను మరింత పెరగాలని సూచించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## హోర్ముజ్ జలసంధి మూసివేత

ఉన్నాయి. వీటితో పాటు దేశంలోని రిఫైనర్లు, చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద బఫర్ నిల్వలు ఉన్నాయి. ఇవి తాత్కాలికంగా భారత చమురు అవసరాలను తీర్చగలవు. కానీ సుదీర్ఘకాలంపాటు హోర్ముజ్? దిగ్బంధనం కొనసాగితే మాత్రం భారత్‌కు ఇబ్బందులు తప్పవు' అని నిపుణులు చెబుతున్నారు. భారత్ ఒక రోజుకు దిగుమతి చేసుకునే ముడి చమురు 5 మిలియన్ బ్యారెళ్లకు కంటే ఎక్కువగా ఉంటుంది. అందులో హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే దిగుమతులో సగటున 2.5 మిలియన్ బ్యారెళ్లు ఉంటుంది. అంటే దాదాపు సగం దిగుమతులు అక్కడి నుంచే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత్ వద్ద ఉన్న 100 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు నిల్వలు, ఒక అంచనా ప్రకారం ఇవి 40-45 రోజులకు మాత్రమే సరిపోతాయి. ఇవి కాకుండా ఇప్పటికే శుద్ధి చేసిన పెట్రోలియం నిల్వలు మరికొంత కాలం భారత్? అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉంది. హోర్ముజ్ జలసంధి మూసివేతతో ముడి చమురు ధరలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇప్పటికే అంతర్జాతీయ బెంచ్ మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 80 డాలర్లకు పైగా పెరిగింది. ఇది ఇరాన్ వర్సెస్? ఇజ్రాయెల్, యూఎస్ యుద్ధం మొదలైనప్పటి నుంచి సుమారు 10 శాతం పెరుగుదల కావడం గమనార్హం. దీనిని బట్టి ఇకపై భారతదేశంపై ముడిచమురు దిగుమతుల బిల్లు భారం మరింత పెరిగే అవకాశం ఉంది. యుద్ధం మరింత ముదిరిన నేపథ్యంలో, ఇరాన్ తాజాగా హోర్ముజ్ జలసంధిని మూసేసింది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గంలో జరిగే ముడి చమురు ఎగుమతుల్లో మూడింట ఒక వంతు, ఎల్ఎన్‌జీ (ద్రవీకృత సహజ వాయువు) రవాణాలో 20 శాతం ఈ జలసంధి గుండానే సాగుతుంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారైన భారత్, తన చమురు దిగుమతుల్లో దాదాపు సగం వరకు ఈ జలసంధి ద్వారానే చేసుకుంటోంది. ఖతార్ నుంచి వచ్చే ఎల్ఎన్‌జీ సరఫరా కూడా ఈ మార్గంలోనే జరుగుతుంది. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధిని మూసివేసిన నేపథ్యంలో, భారత్ తన ముడిచమురు దిగుమతులను పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా, అమెరికా సరఫరాదారులపై ఆధారపడాల్సి రావచ్చు. లేదా వీటికి ప్రత్యామ్నాయం రష్యా చమురును దిగుమతి చేసుకోవచ్చు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే 33కి.మీ పొడవైన హోర్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణాకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో, భారత్‌పై దిగుమతుల బిల్లు భారీగా పెరగనుంది. ముఖ్యంగా ఫ్రైట్ ధరలు పెరగడం, వార్-రిస్క్ ఇన్సూరెన్స్ వల్ల చమురు ధరలు మరింత పెరుగుతాయి.

ఒకవేళ పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రమై, హోర్ముజ్ జలసంధి సుదీర్ఘకాలం పాటు మూతపడితే, చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి. షిప్పింగ్ మార్కెట్? కఠినంగా మారుతుంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. కానీ ఇలా జరిగే అవకాశం చాలా తక్కువగా ఉందని సుమిత్ రితోలియా చెబుతున్నారు. అయితే ప్రస్తుతానికి ముడిచమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఏర్పడుతుండడం, దిగుమతి ఖర్చులు పెరగడమే ప్రధాన ముప్పుగా ఉందని ఆయన చెప్పారు.

# మోడల్ కాలనీలో కానరాని కనీస వసతులు..



**పెదబయలు, పతాకం న్యూస్:** పేరుకే అది మోడల్ కాలనీ. కానీ కనీస వసతులు లేవు. డ్రైనేజీలు, పక్కా రోడ్లు లేవు. తాగునీటి సదుపాయం లేదు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేదు. ఇరవై ఏళ్లుగా ఇదే పరిస్థితి.. ఇదీ మండలంలోని చల్లిమామిడి గ్రామంలో గల శరత్‌కుమార్ మోడల్ కాలనీ దుస్థితి. మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ కేంద్రానికి సమీపంలో ఇరవై ఏళ్ల క్రితం అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శరత్‌కుమార్ చొరవతో ఆయన పేరున మోడల్ కాలనీ ఏర్పాటైంది. ఈ ప్రాంతంలో కొండ అంచున నివసిస్తున్న గిరిజన కుటుంబాలు భారీ వర్షాలు, తుఫానుల సమయంలో వరద ముంపునకు గురవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అప్పటి పీవో శరత్‌కుమార్ చొరవతో ప్రధాన రహదారి పక్కన 35 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోడల్ కాలనీ ఏర్పాటు చేసి గిరిజనులను అక్కడికి తరలించారు.

మోడల్ కాలనీ కదా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తారని ఆశ పడ్డ గిరిజనులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వాలు, అధికారులు మారినా ఇప్పటి వరకు ఆ కాలనీలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. కాలనీలో తాగునీటి సదుపాయం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక కష్టాలు తప్పడం లేదు. అలాగే పక్కా రోడ్లు, డ్రైనేజీలు లేక కాలనీ మొత్తంగా బురదమయంగా ఉంటోందని, కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ సమస్యలపై పాడేరు ఐటీడీఏలో జరిగిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో కనీస వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

## మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు ఎప్పటికీ పూర్తయ్యేనూ.!



**ఎలమంచిలి, పతాకం న్యూస్:** స్థానిక మునిసిపాలిటీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు పనులు ఎప్పుడూ పూర్తవుతాయో పరిస్థితి నెలకొంది. పది నెలల క్రితం శంకుస్థాపన చేయగా, స్థల సమస్య కారణంగా నెల రోజుల క్రితం పనులు మొదలుపెట్టారు. మొత్తం నాలుగు యూనిట్లకు గాను ప్రస్తుతం రెండు యూనిట్లు మాత్రమే ఏర్పాటవుతున్నాయి. మిగిలిన రెండు యూనిట్లకు స్థలాన్ని అన్వేషిస్తున్నారు. పట్టణంలో నివాసాలు, వాణిజ్య సముదాయాలు, ఇతర భవనాల నుంచి వచ్చే వాడుక నీటిని గెడ్డలోకి విడుదల చేస్తున్నారు. దీనివల్ల దోమలబెడదతోపాటు పట్టణానికి ఆనుకొని వున్న పొలాల్లోకి మురుగునీరు చేరుతున్నది. ఈ సమస్యను నివారించడానికి స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ (ఎస్ఏసీ) నిధులు రూ.2.13 కోట్లతో నాలుగుచోట్ల మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పట్టణంలో శేషుకొండ సమీపంలో పెదపల్లి రోడ్డు పక్కన రూ.75 లక్షల వ్యయంతో 0.4 ఎంఎల్‌డీ సామర్థ్యంతో, తెరువుపల్లి వార్డులో రూ.93 లక్షలతో 0.5 ఎంఎల్‌డి సామర్థ్యంతో, కొత్తపాలెం వార్డులో రూ.20 లక్షలతో 0.109 ఎంఎల్‌డీ సామర్థ్యంతో, మంత్రిపాలెం, పెద్దగొల్లలపాలెం ప్రాంతంలో రూ.25 లక్షలతో 0.138 ఎంఎల్‌డీ సామర్థ్యంలో మురుగునీటి శుద్ధి యూనిట్లను నిర్మించాలని ప్రతిపాదించారు. సుమారు పది నెలల క్రితం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అయితే స్థల సేకరణలో జాప్యం కారణంగా నెల క్రితం వరకు పనులు ప్రారంభించలేదు. ఎట్టకేలకు శేషుకొండ, తెరువుపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో వుండడంతో మురుగునీటి శుద్ధి యూనిట్ల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. కాంక్రీట్ ప్లాట్ ఫారం పనులు పూర్తి చేశారు. శుద్ధి ప్లాంట్‌కు సంబంధించిన విడిభాగాలను రప్పించి, అమరుస్తున్నారు. రెండు, మూడు నెలల్లో ఇక్కడ పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో మిగిలిన రెండుచోట్ల స్థలాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

## అధికారుల ప్రతిపాదనలను అంగీకరించని నిర్వాసితులు



**సీలేరు, పతాకం న్యూస్:** జీకే వీధి మండలం సీలేరులో నిర్మించనున్న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం హామీపై పార్వతీనగర్, బూసుకొండ, శాండికోరిలో నిర్వహించిన గ్రామసభలు అర్ధంతరంగా ముగిశాయి. అధికారుల ప్రతిపాదనలకు నిర్వాసితులు అంగీకరించకపోవడంతో గ్రామసభలు సజావుగా సాగలేదు. స్థానిక జెన్‌కో అధికారుల బృందం జీకే వీధి తహశీల్దార్ అన్నాజీరావుతో కలిసి ముందుగా పార్వతీనగర్‌లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్‌కో అధికారులు మాట్లాడుతూ నిర్వాసితుల కుటుంబంలో ఎవరికైతే ఉద్యోగం కావాలనుకుంటున్నారో వారి పేరు, విద్యార్హత వివరాలను ఒక అంగీకార పత్రంపై సంతకం చేసి ఇవ్వాలని కోరారు. ఈ ఉద్యోగం తొలుత మెగా కంపెనీ నిర్మాణ పనుల్లో కల్పిస్తామని, ప్రాజెక్టు పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టు ప్రాతిపదికన మాత్రమే ఉద్యోగం కల్పిస్తామని వారు తెలిపారు. దీనిని నిర్వాసితులు వ్యతిరేకించారు. ఉద్యోగ అవకాశం నేరుగా జెన్‌కోలో కల్పించాలని, లేనిపక్షంలో ప్రాజెక్టు నిర్మాణ పనులను అడ్డుకుంటామని చెప్పి గ్రామసభను బహిష్కరించారు. అనంతరం బూసుకొండ గ్రామానికి వెళ్లిన అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తరువాతే పనులను ప్రారంభించాలని గ్రామసభను వ్యతిరేకించారు. అక్కడ నుంచి శాండికోరి గ్రామానికి అధికారులు వెళ్లగా అదే పరిస్థితి ఎదురైంది. గతంలో ఇంటికో ఉద్యోగం జెన్‌కోలో ఇస్తామని చెప్పి ఇప్పుడు మెగా కంపెనీలో చేరాలని చెప్పడం ఏమిటని, ఎటువంటి ఉద్యోగం ఇవ్వకుండా అంగీకార పత్రంపై సంతకాలు ఎందుకు పెట్టాలని తహశీల్దార్‌ను నిర్వాసితులు నిలదీశారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఇచ్చిన హామీలను పక్కాగా నెరవేర్చిన తరువాతే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని చెప్పి మూడు గ్రామాల నిర్వాసితులు గ్రామసభలను వ్యతిరేకించారు. నిర్వాసితుల సమస్యను పాటించాలని, డిమాండ్లను శాంతియుతంగా అధికారులతో చర్చించాలని సీలేరు ఎస్ఐ ఎండీ యాసిన్ వారికి సూచించారు. అనంతరం తహశీల్దార్ అన్నాజీరావు మాట్లాడుతూ ఈ సమస్యను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. నిర్వాసితులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదని, ఏపీ జెన్‌కోలో ఉద్యోగ నియామకాలు చేపట్టేలా కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట సీలేరు పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ జాకీర్ హుస్సేన్, ఏడీఈ అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

## రైతు కంట కన్నీరు.. పతనమైన టమాటా ధర !



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరాపల్లి, హోల్‌సేల్ కాయగూరలు మార్కెట్లో టమాటా ధర పతనమైయిందని టమాటా ధర రోజు రోజుకు తగ్గి పోవడంతో రైతులు నిరాశ చెంది మంగళవారం మార్కెట్ కి తీసుకొచ్చిన టమోటాలను రోడ్డు పైనే పారబోసి వెనుతిరిగారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పేర్కొన్నారు, ఒక్కసారిగా కిలో టమోటా రెండు రూపాయిలకి ధర పలకడంతో చేసే దేమీ లేక రైతులు దిక్కుతోచని స్తితిలో రోడ్డుపై పారబోసి వెళ్ళిపోయారని తెలిపారు మండలంలోని పలు గ్రామాల నుండి ఇతర మండలాలు నుండి రైతులు విస్తారంగా టమాటాతో పాటు ఇతర కాయగూరలు పంటను పండిస్తున్నారని తెలిపారు పంటలు ఆశాజనకంగా ఉండడంతో రైతు ఆనందం వ్యక్తం చేశారని. ఈపంటను మార్కెట్ కి తరలించే సమయానికి దళారి వ్యాపారులు ఒక్కటై సిండికేట్ గా ఎర్పడి రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు ధర ఒక్క సారిగా తగ్గించే యడంతో రైతుల ఆశలు నిరాశలు అయ్యాయని తెలిపారు. కనీసం ప్రభుత్వ గిట్టుబాటు ధర ఇచ్చే విదంగా చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని అన్నారు దేవరాపల్లి కాయగూరలు మార్కెట్ కు 50 ఎళ్ళు చరిత్ర ఉందని తెలిపారు ఒక ప్పుడు ఇక్కడ పండించే వంకాయి ఇతర కాయ గూరలకు భరంపురం ఒరిస్సా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవని అన్నారు రానురాను దళారి వ్యాపారులు బెడద ఎక్కువగా ఉండటం ఒక పక్క రెండవ ప్రక్కన ప్రభుత్వం మార్కెట్ ను గురించి కోల్ట్ స్టోరేజ్ వంటి సౌకర్యం కల్పించకపోవడం ఎండైన వానలు అయిన పసువులు కన్న అద్వాన్నంగా రోడ్డు పైనె నిలబడి ఉండటం జరుగుతుందని తెలిపారు. మేజర్ పంచాయతీ అయిన లక్ష లాది రూపాయలు అశీళ్ళు వసూళ్ళు చేస్తున్న కనీసం రైతులకు మంచినీళ్ల సౌకర్యం అయిన కల్పించక పోవడం దుర్మార్గ మన్నారు ప్రభుత్వ వెంటనే స్పందించాలని ఈప్రాంతంలో కాయగూరల రైతులను,,, మార్కెట్ ను ప్రోత్సహించాలని ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కోనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోల్ట్ స్టోరేజిని ఏర్పాటు చేయాలని వెంకన్న డిమాండ్ చేసారు.

## చందనోత్సవానికి ఏర్పాట్లు



**సింహాచలం, పతాకం న్యూస్:** శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని (నిజరూప దర్శనం) ఏప్రిల్ 20న నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె.వెంకటరావు తెలిపారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్వామివారి నిజరూప దర్శనానికి ఈ ఏడాది సుమారు 1.4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్తల కుటుంబ సభ్యులు తొలిదర్శనం చేసుకుంటారని, ఆ తరువాత ఉదయం ఐదు గంటల వరకు మాత్రమే ప్రొటోకాల్ దర్శనాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. కేటాయించిన స్లాట్ల ప్రకారం ఐదు గంటల వరకు మాత్రమే ప్రముఖులకు అంతరాలయ దర్శనాలు ఉంటాయన్నారు. సాధారణ భక్తులకు తెల్లవారుజామున మూడు నుంచి రాత్రి పది గంటల వరకూ నిర్విరామంగా నిజరూప దర్శనం సంతృప్తికరంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉచిత, రూ.300, రూ.1,000, రూ.1,500 టికెట్ల ద్వారా దర్శనాలు చేసుకునే భక్తుల కోసం పటిష్ఠమైన క్యూల నిర్మాణం జరుపుతున్నట్టు పేర్కొన్నారు. క్యూలో పది వేల మంది నిరీక్షించేందుకు వీలుంటుందన్నారు. గంటకు సుమారు ఆరు వేల మంది దర్శించుకుంటారని అంచనా వేశామని చెప్పారు. గతానికి భిన్నంగా దర్శన టికెట్లు విక్రయాలను మూడు రోజుల ముందే ముగిస్తామని చెప్పారు. బయటకు వచ్చే మార్గం తక్కువ కావడంతో దక్షిణ ద్వారం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తుల క్యూ మార్గంలో మూడు చోట్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు కొండ దిగువన, ఎగువన ప్రత్యేక స్థలాలు ఎంపిక చేసినట్టు ఈవో తెలిపారు. భక్తుల రాకపోకల కోసం దేవస్థానం 70 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుందన్నారు. చందనోత్సవానికి వచ్చే ప్రముఖులతో సహా అందరూ తమ వాహనాలను కొండ దిగువనే నిలిపివేసి దేవస్థానం ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనాల్లో మాత్రమే సింహగిరికి రాకపోకలు సాగించాల్సి ఉంటుందని ఈఓ స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల సహాయ సహకారాలతో చందనోత్సవం విజయవంతానికి కృషి చేయనున్నట్టు ఈఓ చెప్పారు.

## రావాడ రీ-సర్వే గ్రామ సభలో సాగు పట్టాల కోసం రైతుల వినతి



**పరవాడ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే కార్యక్రమం సందర్భంగా గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రావాడ రెవిన్యూ సర్వే నెం. 418లో గొల్లగుంట గ్రామం ముస్లిం మైనార్టీ తరగతికి చెందిన పలువురు రైతులు వారి తాత ముత్తాతల నుండి వారసత్వంగా సంవత్సరాలుగా జీడీ మామిడి తోటలతో సాగు చేస్తూ వచ్చిన పలాసయం ద్వారా కుటుంబ పోషణ జీవనోపాధి పొందుతున్నామని సర్వే నెం. 418లో ఉన్న తమ భూములకు అధికారికంగా సాగు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ 30 మంది రైతులు సమిష్టిగా స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులకు రైతులు తమ వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం రావాడ రెవిన్యూలో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే ప్రక్రియలో భాగంగా సర్వే నెం. 418 లో సాగు చేస్తున్న రైతులకు సర్వే నిర్వహించి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసి, రైతులకు సాగు హక్కు పత్రాలు జారీ చేయాలని వారు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## మన్యంలో కొనసాగుతున్న పొగమంచు

**పాడేరు, పతాకం న్యూస్:** వాతావరణంలో మార్పుల కారణంగా మన్యంలో పొగమంచు కొనసాగుతున్నది. ఉదయం భానుడి కిరణాలు పొగమంచును చీల్చుకుంటూ పుడమిని తాకాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు పొగమంచు కమ్మేసింది. అలాగే పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, రాత్రి వేళల్లో చలి ప్రభావం చూపుతున్నది. అరకులోయలో 15.5, ముంచంగిపుట్టు, పెదబయలులో 16.3, చింతపల్లిలో 16.7, జి.మాడుగులలో 18.4, కొయ్యూరులో 18.9, అనంతగిరిలో 22.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## తాగునీటి సరఫరా నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు



**బొబ్బిలి, పతాకం న్యూస్:** పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు సంబంధించిన వ్యవస్థల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇంజనీర్లు, సచివాలయ ఎమనిటీస్ సెక్రటరీలు, పైప్‌లైన్ ఫిట్టర్‌లతో ఆమె సమీక్ష నిర్వహించారు. భోజరాజపురం ప్రధాన నీటిసరఫరా కేంద్రం వద్ద అన్ని మోటార్లు, బోర్‌వెల్స్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అన్నీ వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. ఇన్ఫిల్ట్రేషన్ బావులకు నీరు ప్రవహించే మార్గాన్ని ఏర్పాటు చేయాలని, వార్డులలో తాగునీరు సరఫరా అయ్యేటప్పుడు తాగునీటి నాణ్యతను, సరఫరా తీరును పర్యవేక్షించాలని సంబంధిత ఉద్యోగులను ఆదేశించారు. డ్రైనేజీల్లో పైపులైన్లు ఉంటే వెంటనే వాటిని మార్చాలన్నారు. టెండరు స్థాయిలో ఉన్న పనులన్నింటికీ వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.. వీధిదీపాలను పరిశీలించి మరమ్మతులు ఉంటే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెరిగిన జాఫ్రా(అన్నటో) ధరలు



**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలో జాఫ్రా(అన్నటో) ధరలు మరోసారి పెరిగాయి. రెండు వారాల వ్యవధిలో జాఫా ధర గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ప్రాంతీయ మార్కెట్‌లో ప్రైవేటు వర్తకులు, ఎఫ్‌పీవోలు కిలో జాఫ్రా గింజలను రూ.300 ధరకు కొనుగోలు చేస్తున్నారు. జాఫ్రాకు అధిక ధర లభించడంతో ఆదివాసీ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో రైతులు పంట పొలాల గట్లపై జాఫ్రాను సాగు చేస్తున్నారు. జాఫ్రా మొక్కల ఆకులను పశువులు ఆహారంగా తీసుకోవు. దీంతో రైతులు ప్రధానంగా పంట పొలాల గట్లపై కంచెగాను, మరోవైపు అదనపు ఆదాయం కోసం జాఫ్రాను సాగు చేస్తున్నారు. ఈ మొక్కల సాగుకు పెద్దగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. నాట్లు వేసిన మూడో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభం అవుతుంది. ఈ మొక్కలకు తెగుళ్లు, పశువులు ఆశించిన దాఖలాలు లేవు. 2023 వరకు జాఫ్రా గింజలను ప్రాంతీయ మార్కెట్‌లో ప్రైవేటు వర్తకులు కిలో రూ.90-100 ధరకు కొనుగోలు చేసేవారు. 2024లో ఒకేసారి జాఫ్రా ధర రూ.170కి పెరిగింది. జాఫ్రా ధర పెరగడం వల్ల ఆదివాసీ రైతులు ఈ గింజలను ప్రత్యేకంగా సేకరించి మార్కెట్ చేసుకుంటున్నారు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభంలోనే జాఫ్రా గింజలకు రూ.260-280 ధర లభించింది. సోమవారం అన్నవరం వారపు సంత, చింతపల్లి మార్కెట్‌లో వర్తకులు రూ.300 ధరకు కిలో జాఫ్రా గింజలను కొనుగోలు చేశారు.

# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**కోటబొమ్మాళి, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా విస్మరించిందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. సంతబొమ్మాళి మండలం గొలుగువాని పేట గ్రామాని చెందిన గొర్లె రామారావు ఇటీవల సముద్రంలో వేటచేస్తూ ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలో మరణించగా.. ఆ కుంటుంబానికి స్థానిక ఎన్టీఆర్ భవనలో రూ.5లక్షలు సాయాన్ని అందజేసి మాట్లాడారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో అనేక సంక్షేమ ప థకాలు అందించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరిం ణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సాయం అందజేశామన్నారు. పీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 300 మందికి రూ.3కోట్లు సాయంగా అందించామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ భవనంలో టెక్కలి నియోజకవర్గా నికి చెందిన 22 మందికి రూ.19లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అనారో గ్యం ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న వారికి ప్రభుత్వం అండగా ఉం టుందన్నారు. త్వరలోనే ప్రతి కుటుంబానికి రూ.25లక్షలు వైద్య బీ మా వర్తించే లా చేస్తు న్నట్టు తెలిపారు. కార్యక్ర మంలో రాష్ట్ర కళిం గ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరివరప్రసాద్, టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెలమల విజయలక్ష్మి, నాయకులు కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, సాసుమంతు అనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల హామీలు నేరవేర్చేందుకు కృషి



**అరసవల్లి, పతాకం న్యూస్:** ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ కార్య కర్తలు, ఆయాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశంలో ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఎ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే అంగన్ వాడీ సెంటర్లలో మౌలిక వసతులు మెరుగుపరిచామని, కార్యకర్తలకు 15 రోజులు వేసవి సెలవులు, ప్రతినెలా ఒకటో తేదీన వేత నాలు చెల్లిస్తున్నామన్నారు. రెండు పర్యాయాలు వేతనాలు పెంచిన ఘన త టీడీపీ ప్రభు త్వానిదేనన్నారు. చిరుద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వేతనాల పెంపు విషయంలో త్వరలో శుభవార్త వింటా రన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నగర అధ్యక్షుడు పాండ్రంకి శంకర్, ఏపీఎంఎస్ ఎంఈ డైరెక్టర్ ప్రధాన విజయరాం, ఏపీడబ్లూఐడీసీ డైరెక్టర్ పీఎంజే బాబు, కోరాడ హరగోపాల్, సింతు సుధాకర్ పాల్గొన్నారు. 29 మంది లబ్ధిదారులకు రూ.15లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే గొండు శంకర్ పంపిణీ చేశారు.

## జోగి రమేశ్ ను పరామర్శించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి..

# కూటమి ప్రభుత్వంపై విమర్శలు



**ఎన్టీఆర్ జిల్లా, పతాకం న్యూస్:** రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపులు పరాకాష్ఠకు చేరాయని వైసీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జోగి రమేశ్ నివాసానికి వెళ్లిన బుగ్గన ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్ ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాంబులతో దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాకుండా, దాడులు చేసే వారికి ఎస్కార్ట్ ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేక నేరస్థులకు రక్షణ కల్పిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ దాడులను మహిళలు ముందుండి నడిపించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నడూ చూడని కొత్త సంస్కృతి అని ఆయన అన్నారు. మహిళలతో అసభ్యకరంగా మాట్లాడించడం, దాడులు చేయించడం వెనుక పెద్దల 'కోచింగ్' ఉందని ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసినప్పటికీ, ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని బుగ్గన తప్పుబట్టారు. బాధితులపైనే కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలి కానీ, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడానికి కాదని అన్నారు.

# భార్య, అత్తను నరికి చంపిన కిరాతకుడు



**సీతానగరం, పతాకం న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో అర్ధరాత్రి వేళ ఘోర రక్తపాతం సంభవించింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యను, అత్తను కత్తితో నరికి అతి దారుణంగా హత్య చేశాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోడదాసి పండు (అలియాస్ సీతారామరాజు) అనే వ్యక్తి, తన భార్య లత (27), అత్తగారైన గుమ్మడి లక్ష్మి (50) పై అర్ధరాత్రి 12 గంటల సమయంలో కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావం కావడంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. నిందితుడు పండుకు గతంలో లతతో వివాహం జరిగింది. అయితే, వీరిద్దరి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా కొన్నాళ్ల క్రితమే విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతం పండు వేరే మహిళతో కలిసి నివసిస్తున్నట్లు సమాచారం. విడిపోయిన తర్వాత కూడా పాత కక్షలు, తాజా వివాదాలే ఈ దారుణానికి కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, హత్యకు గల అసలు కారణాలపై ఆరా తీస్తున్నారు. నిందితుడు పండు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురికావడంతో బొబ్బిల్లంక గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం



**పాతపట్నం, పతాకం న్యూస్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజక వర్గ పరిధిలోని ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్తూరు మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు యువత కోరారు. కొత్తూరు మండలం కృష్ణా పురంలో ఈశ్వరుడి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరీ చేయాలని కోరారు. మెళియాపుట్టి మండలం కొత్తూరులో రచ్చబండ ఏర్పాటు చేయాలని, టవర్ ఏర్పాటు చేయాలి పలువురు కోరారు. ఇలా వివిధ సమస్యలపై 28 వినతులు అందాయన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యా ర్థి కడింటి వంశీ సాఫ్ట్‌టెన్నీస్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంతో ఆ క్రీడాకారుడు సోమవారం ఎమ్మెల్యేను కలుసుకున్నారు. క్రీడాకారుడి అభి నందించి రూ.10 వేలు సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పూజారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హామీలను అమలుచేయాలని అడిగితే అరెస్టులా?




**ఏలూరు, పతాకం న్యూస్:** వేతనాలు పెంచాలని కోరుతూ .... శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీల పై ధమన కాండను ఖండిస్తూ నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని సిఐటియు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా అంగన్వాడీలు ఏలూరు సిఐటియు కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే అక్రమ అరెస్టులు చేస్తారా ? అంటూ అంగన్వాడీలు మండిపడ్డారు. వేతనాలు పెంచకుండా ప్రభుత్వం అంగన్వాడీల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు.

# నక్కపల్లిలో 'ఆర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్' (ఏఎంఎన్ఎస్)కు భూమిపూజ కార్యక్రమానికి వేగంగా ఏర్పాట్లు



**నక్కపల్లి, పతాకం న్యూస్:** నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న 'ఆర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్' (ఏఎంఎన్ఎస్)కు భూమిపూజ కార్యక్రమానికి వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం .2,200 ఎకరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఏఎంఎన్ఎస్ సీఈఓ దిలీప్‌ఓమెన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం నక్కపల్లి మండలంలో కంపెనీకి కేటాయించిన భూములను, అక్కడ జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించారు. అనంతరం అనకాపల్లి కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శౌర్యమాన్ పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్టీల్ ప్లాంట్ భూమి పూజకు జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. భూ సమీకరణ, రహదారుల నిర్మాణం, ప్రాజెక్టుకు అవసరమైన నీటి సరఫరా కోసం జరుగుతున్న పైపులైన్ ఏర్పాటు పనులు, పునరావస కాలనీల అభివృద్ధి, ప్రభావిత కుటుంబాల తరలింపుపై అధికారులతో చర్చించారు. శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని మోదీ లేదా సీఎం చంద్రబాబు వస్తారని, ఇందుకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టాలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్ వారికి సూచించారు. ఏఎంఎన్ఎస్ ప్రతినిధుల బృందంలో ప్రాజెక్టు చీఫ్ కేఎల్ చౌదరి, హెచ్‌ఆర్ డైరెక్టర్ అశితోష్ తెలియాంగ్, అడ్మిన్ హెడ్ కెప్టెన్ దీపక్ పట్నాయక్, హెచ్‌ఆర్ అడ్మిన్ డీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు



**సోంపేట, పతాకం న్యూస్:** సోంపేట మండలం బారువ బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లి ప్రమాద వశాత్తు మునిగిపోతున్న ఓ యువకుడిని మెరైన్ పోలీసులు రక్షించారు. వివరాలిలా ఉన్నాయి.. సోంపేట పట్టణం గాంధీనగర్ వీధికి చెందిన ఆర్థి వాసుదేవ్ సముద్రంలో స్నానం చేశాడు. ఇదే సమయంలో ప్రమాదవశాత్తు మునిగి నీళ్లు తాగేస్తుండగా అక్కడే ఉన్న మెరైన్ సిబ్బంది అప్రమత్తమ య్యారు. సదరు యు వకుడిని ఒడ్డుకు చేర్చి 108 వాహనంలో హరిపురం పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించినట్లు సీఐ రమేష్ తెలిపారు. ఏఎస్ఐ కోదండరావు, హెచ్‌సీ ఉమామహేశ్వరరావు, సిబ్బంది సంగమేశ్వరరావు, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

# రైతులు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



**నరసన్నపేట, పతాకం న్యూస్:** రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కొత్తపోలవలసలో రాజముద్రతో జారీ చేసిన పాస్‌పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారులు పాస్ పుస్తకాలు రైతులు అందించడం సంతోషంగా ఉందన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలపై అప్పటి సీఎం జగన్ ఫొటోను చూసిన రైతులు నిద్రలేని రాత్రులు గడపారని, భూ సరిహదెంద రాళ్ల పై కూడా ఫొటోలు ఉండటం చూసి రైతులు ఆవేదన చెందారన్నారు. మనభూమిపై పులివెందుల పంచాయతీ ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సమస్యకు పరిష్కారం చూపిందన్నారు. లిటికేషన్ భూములు క్రమబద్ధీకరణ,భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, పొందరి, కురాకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ దామోదరం నర్సింహాలు, పీఏసీఎస్ చైర్మన్ ఇసా అప్పారావు, సర్పంచ్ పట్ట ప్రభాకర్, టీడీపీ నాయకులు అడపా చంద్రశేఖర్, పూతి రమణ, రావాడ కృష్ణ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



**రామభద్రపురం, పతాకం న్యూస్:** ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడక బలరాంనాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థికపరమైన సమస్యలతో పాటు వివిధ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. 2023 జూలై నాటికి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా రెండేళ్లైనా కనీస వేతనసవరణ సంఘాన్ని ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయు లకు గ్రాడ్యూటీ, సరండర్ లీవు, ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదన్నా రు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఏపీటీ ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాగాన సత్యారావు, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బొప్పే రవికుమార్, నాయకులు సువ్వాడ వెంకటప్పల నాయుడు, స్టేట్ కౌన్సిలర్ డోకల ర ఘురాం నాయుడు పాల్గొన్నారు.

## ఉపాధిలో మస్టర్ అక్రమాలు చెక్



**ఒంగోలు, పతాకం న్యూస్:** ఉపాధిలో మస్టర్ అక్రమాలు ఇక కుదరవు. పనులకు రాని వారికి హాజరు వేసే సిబ్బంది అవినీతికి చెక్ పడినట్లే. ఉపాధి హామీ పథకం అమలులో చట్ట సవరణతోపాటు పలు మార్పులు, చేర్పులు చేపట్టిన కేంద్రప్రభుత్వం.. బోగస్ మస్టర్ల నిరోధం లక్ష్యంగా ఈ తాజా విధానాన్ని తీసుకొచ్చింది. సోమవారం నుంచి అది అమలులోకి వచ్చింది. పథకం అమలు ప్రారంభమయ్యాక చాలా సంవత్సరాలు పనికి వచ్చిన కూలీల హాజరును ఆ గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్ లేదా అక్కడి మేట్ (మేస్త్రీ) కాగితాలపై నమోదు చేసేవారు. ఆ విధానంలో భారీగా అక్రమాలు జరిగేవి. పనులకు రాని వారికి సైతం తమకు ఇష్టమైతే ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది హాజరు వేసేవారు. అవేకాక అసలు పనికిరాని కొన్ని పేర్లకు లేదా తమ కుటుంబ సభ్యుల పేర్లతో మస్టర్లు వేసుకొని ఆ నగదు స్వాహా చేసేవారు. చాలాచోట్ల గ్రామ స్థాయిలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ స్థానిక నేతలు కూడా వాటాలు తీసుకునేవారు. వాటిని అరికట్టడానికి కొన్ని ప్రత్యేకమైన మార్పులు, విధానాలు తెచ్చినా అవి ఏమాత్రం అవకతకవకలను అడ్డుకోలేకపోయాయి. ఉపాధి సిబ్బంది ఏదో ఒక రూపేణా అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 6.29 లక్షల మంది కూలీలకు జాబ్‌కార్డులు ఉండగా వారిలో 5.28 లక్షల మందికి ఈకేవైసీ పూర్తయింది. ఇంకా సుమారు లక్షమందికిపైగా ఈకేవీసీ చేయాల్సి ఉండగా వారిలో అత్యధికులు వివిధ వ్యవసాయ, ఇతర పనుల కోసం తాత్కాలికంగా వలస వెళ్లి ఉన్నట్లు డ్వామా సిబ్బంది గుర్తించారు. అలాంటి వారు తిరిగి తమ ప్రాంతానికి చేరుకొని పనులకు వచ్చే సమయంలో ఈకేవైసీ చేసే అవకాశం ఉంది. మొత్తం మీద తాజాగా తెచ్చిన విధానంతో బోగస్ మస్టర్లకు చెక్‌పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఏఐని మానవ జాతి సంక్షేమానికి ఉపయోగించాలి




**గుంటూరు, పతాకం న్యూస్:** ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలపై ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ప్రభావం ఉందని, ఎఐని మానవ జాతి సంక్షేమానికి ఉపయోగించాలని ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ నిపుణులు, వాల్‌మార్ట్ ఇండియా సైబర్ సెక్యూ రిటీ హెడ్ ఎస్.దిలీప్‌కుమార్ అన్నారు. జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో జరి గిన జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ టెక్నో వర్క్‌షాప్‌లో ఆయన ప్రధాన రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. టెక్నో వర్క్‌షాప్‌లో వివిధ ఇంజినీరింగ్ కాలేజీల నుండి దాదాపు 500 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ సభకు జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత మూడు శతాబ్ధాల్లో పారిశ్రా మిక విప్లవం, సాంకేతిక విప్లవం జరిగాయని, ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విప్లవం జరగబోతోందని చెప్పారు. విద్యార్థులు దానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలని చెప్పారు. టెక్నాలజీకి సంబంధించిన ఏ మార్పు లైనా మానవ జాతి పురోగమనానికి, ఉపాధి కల్పనకు దోహదపడాలని, కానీ కార్పొరేట్ కంపెనీల ధృక్పథం, ఆలోచనలు ప్రజా సంక్షేమా నికి అనుగుణంగా ఉండవని చెప్పారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ మాట్లాడుతూ జెవివి పాఠశాల స్థాయిలో పెద్దఎత్తున చెకు ముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచటానికి కృషి చేస్తోందని, భవిష్యత్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులకూ నిర్వహి స్తామని అన్నారు. విద్యార్థులు జీవన, సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిం చారు. వర్క్‌షాప్ అనంతరం విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్ర మంలో సన్ ప్రతినిధి కె.యశ్వంత్, స్వేచ్ఛ సంస్థ నిర్వాహకులు ప్రొఫెసర్ శ్రీపతిరారు, నిహారిక, జెవివి నాయకులు కె.శ్రీనివాస్, మురళీధర్, చాందిని, టి.ఆర్.రమేష్, చలపతి సిఎస్ఇ హెచ్‌ఒడి బాలాజీ పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం



**దుర్గి, పతాకం న్యూస్:** విద్యుత్ కోతల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని మండలంలోని కోలగుట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళనకు దిగారు. కోలగుట్ల-కంచరగుంట గ్రామాల మధ్య ఉన్న సబ్‌స్టేషన్‌ను కంచర గుంట గ్రామ రైతులు నిర్బంధించి, రహదారిపై నిరసన చేపట్టారు. విద్యుత్ కోతల వల్ల బోరు మోటార్లు పనిచేయడం లేదని, పంటలకు సాగునీరందక దిగుబడులు తగ్గుతున్నాయని, తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదనకు గురయ్యారు. పశువులకు తాగునీరు కూడా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సబ్‌స్టేషన్ అసిస్టెంట్ లైన్‌మన్ నిర్లక్ష్య వైఖరి వల్లే సమస్యలు తలెత్తాయని మండిపడ్డారు. పాడైన ఫీడర్‌ను వెంటనే మరమ్మతు చేసి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ధర్నా చేయడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమా చారం అందుకున్న మాచర్ల విద్యుత్ శాఖ అధికారులైన ఎడిఎ రామయ్య, ఎఇ జి.సీతా రామ్ ధర్నా వద్దకు చేరుకున్నారు. ఫీడర్‌లో లోపం గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరి ంచారు. రైతులతో ఎస్ఐ సుధీర్ కుమార్ మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

# పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరం

## ఇరాన్‌పై దాడులను మరింత పెంచుతామన్న ట్రంప్





**ఇరాన్:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపు దాల్చాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాల సైనిక చర్య ఉధృతంగా సాగుతోంది. లెబనాన్ నుంచి తమపై దాడికి తెగబడిన హెజ్బొల్లాపైనా ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. అటు ఇరాన్, దాని మిత్రదేశాలు, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లోని చమురు శుద్ధి కేంద్రాలపై దాడికి దిగాయి. ఈ దాడుల తీవ్రత పెరుగుతుండగా యుద్ధం నుంచి బయటపడే స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం వంటి అంశాలు సుదీర్ఘ పోరాటానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య మరికొన్ని వారాలు కొనసాగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ 250కిపైగా బాంబులను ప్రయోగించి, అక్కడి భద్రతా వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఇదే సమయంలో ఇరాన్‌కు మద్దతుగా దాడులకు దిగిన హెజ్బొల్లాను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. లెబనాన్ రాజధాని బీరూట్‌తో పాటు దక్షిణ, తూర్పు ప్రాంతాల్లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డజన్ల కొద్దీ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో మరణించిన వారి సంఖ్య 52కు చేరింది. మరో 154 మంది గాయపడ్డారు. హెజ్బొల్లా ఇంటెలిజెన్స్ సీనియర్ అధికారి హుస్సేన్ మొకలెద్‌ను చంపినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. 70కి పైగా ఆయుధ గిడ్డంగులు, క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసినట్లు తెలిపింది. లెబనాన్‌లో భూతల దాడులూ చేపట్టే అవకాశం ఉందనే సంకేతాలిచ్చింది. దాడుల భయంతో వేలాది మంది ప్రజలు దక్షిణ లెబనాన్ నుంచి రాజధాని బీరూట్‌కు తరలివెళ్లారు. మరోవైపు హెజ్బొల్లా గ్రూపు తమతో సంప్రదించకుండా ఇజ్రాయెల్‌పై దాడులు చేయడాన్ని లెబనాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. హెజ్బొల్లా సైనిక కార్యకలాపాలను లెబనాన్ ప్రభుత్వం నిషేధించింది.

ఇరాన్ అణ్వాయుధాలను తయారుచేయకుండా అడ్డుకొని తీరుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామన్న ఆయన, అవసరమైతే భూతల దాడులూ చేస్తామని తెలిపారు. ఇరాన్‌పై దాడుల విషయంలో గల్ఫ్ దేశాలు తమ వెంటే ఉన్నాయని పేర్కొన్నారు.

"అమెరికాకు పొంచి ఉన్న తీవ్రమైన ముప్పులను తొలగించేందుకు, ఉగ్రవాద పాలనకు వ్యతిరేకంగా అమెరికా సైన్యం ఇరాన్‌లో భారీ ఎత్తున పోరాటాలను కొనసాగిస్తోంది. ఈ భయంకరమైన, దుర్మార్గపు పాలన నుంచి పొంచి ఉన్న భరించలేని ముప్పులను తొలగించడానికి మాకు దొరికిన చివరి, ఉత్తమ అవకాశం ఇదే, ఇప్పుడు మేం చేస్తున్నది అదే. మా లక్ష్యాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. మొదటిది ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, కొత్త క్షిపణులను తయారు చేసే వారి శక్తిని మేం నాశనం చేస్తున్నాము, ఇది ప్రతి గంటకు జరుగుతుండటాన్ని మీరు చూడవచ్చు. రెండోది వారి నౌకాదళాన్ని మేము సమూలంగా తుడిచిపెడుతున్నాం. ఇప్పటికే 10 నౌకలను సముద్ర గర్భంలో కలిపేశాం. మూడోది, ప్రపంచంలోనే ఉగ్రవాదానికి అతిపెద్ద స్పాన్సర్ అయిన ఈ దేశం ఎన్నటికీ అణు ఆయుధాన్ని పొందకుండా నిర్ధారిస్తున్నాం. చివరగా ఇరాన్ పాలన తన సరిహద్దుల బయట ఉన్న ఉగ్రవాద సైన్యాలకు ఆయుధాలు అందించడం, నిధులు సమకూర్చడం, వారిని నడిపించడం వంటి పనులను ఇకపై కొనసాగించకుండా మేం నిర్ధారిస్తున్నాం. అమెరికా ప్రజలకు ఈ ఉగ్రవాద పాలన వల్ల పొంచి ఉన్న ముప్పును అణిచివేసేందుకు మేం అత్యంత ఉద్ధృతమైన, అచంచలమైన సంకల్పంతో ఈ మిషన్ కొనసాగిస్తున్నాం. ఏది ఏమైనా మేము దీనికి నాలుగు నుంచి ఐదు వారాల సమయం పడుతుందని అంచనా వేశాం. కానీ, అంతకంటే చాలా ఎక్కువ కాలం కొనసాగించే సామర్థ్యం మాకు ఉంది. మేము దానిని చేసి తీరుతాం." అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలియజేశారు. అటు ఇరాన్‌పై దాడుల వివరాలను వెల్లడించిన అమెరికా శ్వేతసౌధం ప్రతినిధి కరోలిన్ లీవిట్ ఇరాన్ ప్రభుత్వానికి చెందిన 49 మంది అత్యున్నత స్థాయి నేతలను "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" ద్వారా మట్టుబెట్టినట్లు ప్రకటించారు. ఒమన్ గల్ఫ్‌లో ఉన్న ఇరాన్‌కు చెందిన 11 యుద్ధ నౌకలను అమెరికా దళాలు ముంచేశాయని తెలిపారు. మరోవైపు ఇరాన్ దాడుల్లో ఇప్పటివరకూ ఆరుగురు అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారు.

సుప్రీం లీడర్ ఖమేనీ మృతి తర్వాత ప్రతీకార దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్, ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. గల్ఫ్‌లోని చమురుశు ద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులను సంధించింది. ఈ క్రమంలో సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రమైన ఆరామ్‌కోపై దాడి జరగ్గా తాత్కాలికంగా మూసివేశారు. ఖతార్‌లోని చమురుశుద్ధి కేంద్రాలపైనా ఇరాన్ దాడులకు యత్నించగా ఖతార్ ఎనర్జీ తన లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ ఉత్పత్తిని నిలిపివేసింది. ఇరాన్ నుంచి వచ్చిన రెండు విమానాలు, ఏడు క్షిపణులు, ఐదు డ్రోన్లను కూల్చివేసినట్లు ఖతార్ రక్షణ శాఖ తెలిపింది. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఇల్లు, కార్యాలయంపైనా దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఆయన ఎలా ఉన్నారో తెలియదంటూ ప్రచారం చేసింది. అనంతరం బయటకొచ్చిన నెతన్యాహూ ఆదివారం ఇరాన్ క్షిపణి దాడిలో తొమ్మిది మంది ఇజ్రాయెలీలు మరణించిన ప్రాంతాన్ని సందర్శించారు. ఇరాన్ అణు ఆయుధాలు సాధిస్తే అది మానవాళికే ముప్పు అని ఆయన హెచ్చరించారు. ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక చర్య ద్వారా తనను తాను రక్షించుకోవడమే కాకుండా ప్రపంచ భద్రతను కాపాడడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## నరసన్నపేట పరిసరాల్లో పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు!

**నరసన్నపేట, పతాకం న్యూస్:** నరసన్నపేట పట్టణంలో భూముల విలువ రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొన్నిచోట్ల డీపట్టా భూములు, ప్రభుత్వ స్థలాల్లో లేఅవుట్లను వేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తొలుత మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు డీపట్టా భూములను కొనుగోలు చేస్తున్నారు. అనంతరం వాటి పక్కనే ఉన్న జిరాయితీ భూములను కూడా కొనుగోలు చేసి మొత్తం ఒకే సర్వే నెంబరులో ఉన్నట్లు ప్లాన్‌లో చూపించి అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా నరసన్నపేటకు సమీపంలో ఉన్న బొరిగివలస, కోమర్తి, గొట్టిపల్లి, కరగాం, జమ్ము, తామరాపల్లి, దేవాది, జమ్ము పంచాయతీలతోపాటు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పదికి పైగా అక్రమ వెంచర్లు వెలిశాయి. వీటిపై పంచాయతీ, రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గొట్టిపల్లి పంచాయతీ వృద్ధాశ్రమానికి సమీపంలో సుమారు ఎకరా విస్తీర్ణం గల బండి గోర్జిని ఆక్రమించి లేఅవుట్ వేశారు. ఒక మార్కెటింగ్ సంస్థ ఈ లేఅవుట్‌ను జిరాయితీ భూమిగా తప్పుడు పత్రాలను చూపించి ప్లాట్లను విక్రయిస్తోంది. అక్కడే ఉన్న కొండను సైతం చదును చేసి లేఅవుట్‌లో కలిపేశారనే ఆరోపణలు ఉన్నాయి. గొట్టిపల్లి రెవెన్యూ పరిధి జమ్ము సమీపంలో పోరంబోకు స్థలాన్ని చదును చేసి లేఅవుట్ వేశారు. దాన్ని జిరాయితీ భూమిగా చూపించి ప్లాట్ల విక్రయాలు చేపడుతున్నారు. బొరిగివలస రెవెన్యూ పరిధిలోని వెంకన్న చెరువు గర్భాన్ని ఆక్రమించి ప్లాట్లు వేశారు. జమ్ము జంక్షన్ వద్ద వంశధార కాలువ స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేసి విక్రయాలు చేపట్టారు.



నరసన్నపేట మండలం సుడా పరిధిలో ఉంది. సుడా అనుమతుల మేరకే ఎవరైనా వెంచర్లు వేయాలి. కానీ, కొందరు రియల్టర్లు ఇవేమీ పట్టించుకోవడం లేదు. రెండేసి, మూడేసి ఎకరాల్లో చిన్నచిన్న లేఅవుట్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నిబంధనల ప్రకారం వెంచర్ల వద్ద సామాజిక అవసరాల కోసం కొంత స్థలాన్ని కేటాయించాలి. పాఠశాల, పార్కు, సామాజిక భవనం తదితర అవసరాలకు 20 శాతం నుంచి 40 శాతం వరకు స్థలాన్ని ఉంచాలి. 40 అడుగుల మేర రోడ్లను ఏర్పాటు చేయాలి. కానీ, ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వానికి ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా రుసుం చెల్లించాలి. కానీ, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి రుసుం చెల్లించకుండానే వ్యవసాయ భూముల్లో ప్లాట్లు వేసి అమ్మకాలు చేపడుతున్నారు. వీటిని కొనుగోలు చేస్తున్న వారికి భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొనుగోలుదారులు మోసానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఇరాన్‌పై దాడికి వామపక్షాల నిరసన




**అమరావతి, పతాకం న్యూస్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. యుద్ధాన్ని ఆపాలని, ప్రపంచ శాంతి కాపాడాలని, మానవజాతి రక్షించబడాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామకృష్ణ, సిపిఎం అమరావతి కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ ఇరాన్‌పై దాడిచేసి ఆ దేశాధినేత అయుతుల్లా ఖమేనీని హత్యచేయడం సామ్రాజ్యవాదం కుట్రన్నారు. అమెరికా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవటం కోసం పశ్చిమ ప్రాంత దేశాల్లో అంతరంగత యుద్ధాలు రగిస్తోందని, చమురు సంపదను దోచుకోవడానికి ఈ యుద్ధోన్మాదమని అన్నారు. వెనిజులా దేశ అధ్యక్షుడు మధురో, అతని భార్యను ఇటీవలే అక్రమంగా నిర్బంధించారని, అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘిస్తున్న సామ్రాజ్యవాద దేశాల చర్యల్ని భారతదేశం ఖండించాలని అన్నారు. నిరసనలో సిపిఐ, సిపిఎం నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.విజరు, చెన్నకేశవరావు, విశ్వనాథం, ఎస్.రాజకుమార్, నాగూల్‌మీరా, ఎషయ్య, వైసిపి నాయకులు టి.సూరిబాబు, రఫీ, ఎస్‌కె.ఆదాం పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

**అయినవిల్లి, పతాకం న్యూస్:** పౌర హక్కులను పరిరక్షించే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజ్యంగ పరిరక్షణ సమితి పిలుపునిచ్చింది. మండలంలోని శానపల్లిలంక పంచాయతీ గుంట్రుగారిపేట, కొండుకుదురు పంచాయతీ గుత్తాల వారి పేట, తదితర గ్రామాల్లో పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 'గడప గడపకి భారత రాజ్యాంగం -- రాజ్యాంగంపై అవగాహన సదస్సు' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెనుమాల సుధీర్ ఆయా గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలన సాగిస్తున్న మనువాద, మతోన్మాద ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన పౌరుల హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. వీటిని తిప్పికొట్టేలా బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలు సంఘటితమై రాజ్యాంగ పరిరక్షణకు చైతన్యవంతమైన పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు.

## మొక్కజొన్నను క్వింటాల్ రూ.2400కు కొనాలి



**ప్రత్తిపాడు, పతాకం న్యూస్:** మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించేలా మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాళ్ రూ.2400కు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయించాలని రైతు ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గుంటూరులో వినతిపత్రం ఇచ్చారు. గుంటూరు జిల్లా తెలుగురైతు అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, తెలుగు రైతు మీడియా కో-ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతేడాది నల్ల బర్లి పొగాకు సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈ ఏడాది ప్రత్యామ్నాయంగా భారీ ఎత్తున మొక్కజొన్న పంటను వేశారని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి క్వింటాళ్ రూ.1600కే కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధర ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు, ముఖ్యంగా కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

## ఉచిత మెగా వైద్య శిబిరంలో పలువురికి చికిత్స

**పశ్చిమగోదావరి, పతాకం న్యూస్:** యలమంచిలి గ్రామంలో యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపు ఒమేగా అను హాస్పిటల్స్ విజయవాడ, అమరావతి కంటి ఆసుపత్రి పాలకొల్లు వారి సౌజన్యంతో యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, పాలకొల్లు వారి సహకారంతో దిగ్విజయంగా జరిగింది. సుమారు 550 మందికి రక్త పరీక్షలు, బిపి పరీక్షలతోపాటు ఉచిత ఇసిజి, 2డి ఎకో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర మెడికల్ అధినేత అందే హరి ప్రసాద్, త్సవటపల్లి సత్యనారాయణ ఉచితంగా మందులు అందజేశారు. అమరావతి కంటి ఆసుపత్రి పాలకొల్లు, నేత్రాలయం ఆప్టికల్స్, చైతన్య ఆప్టికల్స్ సౌజన్యంతో కంటి పరీక్షలు చేయించుకున్న 60 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ముత్యాల పెద్దిరాజు, పినిశెట్టి శ్రీనివాస్ ఉచిత కళ్లజోళ్లు సమకూర్చారు.

### ముగ్గురి ఆత్మహత్య కేసులో

## వడ్డీ వ్యాపారుల అరెస్ట్




**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ అంబర్‌పేట బాపూనగర్‌లో ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనలో, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఫిబ్రవరి 24న కాడ్గేకర్ రామరాజ్ (54), ఆయన భార్య మాధవి, సోదరుడు కాడ్గేకర్ శశాంక్ రాజ్ తమ ఇంట్లో విగతజీవులుగా కనిపించిన విషయం తెలిసిందే. ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్స్, కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కింగ్స్ బిర్యానీ హోటల్ నిర్వహణ కోసం మృతులు నిందితుల వద్ద రూ. 57 లక్షల అప్పు తీసుకున్నారు. అయితే, నిందితులు అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా.. ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, భూమి పత్రాలను బలవంతంగా తీసుకున్నారని డీసీపీ తెలిపారు. డబ్బులు తిరిగి చెల్లించాలని నిందితులు ఫోన్లలో అసభ్యంగా మాట్లాడటం, ఇంటికి వచ్చి బహిరంగంగా అవమానిస్తామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు రోజు రాత్రి (ఫిబ్రవరి 23) కూడా నిందితులు ఫోన్ చేసి డబ్బులు కట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు కాల్ డేటా ద్వారా పోలీసులు నిర్ధారించారు. ఈ కేసును బిఎన్‌ఎస్ సెక్షన్ 108 (ఆత్మహత్యకు ప్రేరేపించడం) కింద మార్చి దర్యాప్తు చేశారు.

## బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి

**కర్నూలు, పతాకం న్యూస్:** బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ డా.ఏ. సిరి పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో బాల్య వివాహ ముక్త్ భారత్ - 100 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ విముక్త రథాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం బాల్య వివాహ ముక్త్ భారత్ పేరుతో వంద రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్, ఐసీడీఎస్ పీడీ విజయ, సీడీపీవోలు పాల్గొన్నారు.

# థైరాయిడ్ ఎందుకు వస్తుంది?



థైరాయిడ్ అనేది సీతాకోకచిలుక ఆకారంలో ఉండే గ్రంథి. ఇది మెడ ముందు భాగంలో ఉంటుంది. ఇది శారీరక జీవన క్రియను నియంత్రించే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు శరీరంలోని ప్రతి అవయవం పనితీరుకు అవసరం. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయనప్పుడు అది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. థైరాయిడ్‌లు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయని వరంగల్ నగరానికి చెందిన సీనియర్ ఫిజీషియన్, ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ అజిత్ మహమ్మద్ వెల్లడించారు. హైపోథైరాయిడిజం, హైపర్ థైరాయిడిజం ఈ రెండు రకాలుగా ఉంటాయి.

హైపోథైరాయిడిజం అనేది ఎక్కువ మందిలో వస్తుంది. థైరాయిడ్ గ్రంథి అనేది సీతాకోకచిలుక ఆకారంలో మెడ ముందు భాగంలో ఉంటుంది. ఇందులో హాషిమోటో థైరాయిడిటిస్ అని ఉంటుంది. ఇది ఆటో ఇమ్యూన్ వ్యాధి. ఇది శరీరం తన స్వంత కణాలపై దాడి చేస్తుంది. ఇది థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. అయోడిన్ లోపం వల్ల కూడా థైరాయిడ్ వస్తుంది. అయోడిన్ అనేది థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి ఒక ముఖ్యమైన పోషకం. ఆహారంలో తగినంతగా అయోడిన్ లేనప్పుడు థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పనిచేయదు. థైరాయిడ్ హార్మోన్లను తగినంతగా ఉత్పత్తి చేయలేకపోవడంతో హైపోథైరాయిడిజం వచ్చే అవకాశం ఉంటుంది. థైరాయిడ్ వ్యాధి యొక్క రెండు ప్రధాన రకాలు హైపోథైరాయిడిజం (నిష్క్రియాత్మక థైరాయిడ్) మరియు హైపర్ థైరాయిడిజం (అతి చురుకైన థైరాయిడ్). కానీ వాటిలో ప్రతి ఒక్కటి వాటికి కారణమయ్యే అనేక పరిస్థితులను కలిగి ఉంటాయి.

ఇది జీవితాంతం కొనసాగే (దీర్ఘకాలిక) ఆటో ఇమ్యూన్ వ్యాధి , ఇది థైరాయిడ్ గ్రంథి పనిచేయకపోవడానికి కారణమవుతుంది. అయోడైజ్డ్ ఉప్పు మరియు ఇతర అయోడిన్-సమృద్ధ ఆహారాలు విస్తృతంగా అందుబాటులో ఉన్న దేశాలలో ఇది హైపోథైరాయిడిజానికి అత్యంత సాధారణ కారణం. మీ థైరాయిడ్ గ్రంథికి థైరాయిడ్ హార్మోన్‌ను తయారు చేయడానికి అయోడిన్ అవసరం, కాబట్టి మీ ఆహారంలో ఈ ఖనిజం లేకపోవడం వల్ల హైపోథైరాయిడిజం వస్తుంది. అయోడైజ్డ్ ఉప్పు విస్తృతంగా అందుబాటులో లేని దేశాలలో ఇది హైపోథైరాయిడిజానికి అత్యంత సాధారణ కారణం. ఇది తరచుగా గాయిటర్ (విస్తరించిన థైరాయిడ్) కు కారణమవుతుంది. కొన్నిసార్లు, పిల్లలు థైరాయిడ్ లేకపోవడం లేదా పనిచేయకపోవడం వంటి సమస్యలతో పుడతారు. “పుట్టుకతోనే వచ్చేది” అంటే “పుట్టుకతోనే ఉంటుంది”. ప్రతి 2,000 నుండి 4,000 మంది శిశువులలో 1 మందికి పుట్టుకతోనే హైపోథైరాయిడిజం ఉంటుంది.

గ్రేవ్స్ వ్యాధి : ఇది దీర్ఘకాలిక ఆటో ఇమ్యూన్ పరిస్థితి, ఇది అతి చురుకైన థైరాయిడ్‌కు కారణమవుతుంది. ఇది హైపర్ థైరాయిడిజానికి అత్యంత సాధారణ కారణం.

థైరాయిడ్ నోడ్యూల్స్ : ఇవి మీ థైరాయిడ్ గ్రంథిపై అసాధారణమైన గడ్డలు. నోడ్యూల్స్ హైపర్‌గా పనిచేస్తుంటే, అవి హైపర్ థైరాయిడిజానికి దారితీయవచ్చు.

అధిక అయోడిన్ : మీ శరీరంలో అయోడిన్ ఎక్కువగా ఉన్నప్పుడు, మీ థైరాయిడ్ మీకు అవసరమైన దానికంటే ఎక్కువ థైరాయిడ్ హార్మోన్లను తయారు చేస్తుంది. అమియోడారోన్ (గుండెకు మందు) వంటి కొన్ని మందులు తీసుకోవడం ద్వారా మీరు అధిక అయోడిన్‌ను అభివృద్ధి చేయవచ్చు.

వేర్వేరు సమయాల్లో హైపోథైరాయిడిజం మరియు హైపర్ థైరాయిడిజం రెండింటికీ కారణమయ్యే పరిస్థితులు:

థైరాయిడిటిస్ : ఇది మీ థైరాయిడ్ గ్రంథి యొక్క వాపు (వాపు). ఇది సాధారణంగా మొదట తాత్కాలిక హైపర్ థైరాయిడిజానికి కారణమవుతుంది మరియు తరువాత తాత్కాలిక లేదా దీర్ఘకాలిక హైపోథైరాయిడిజానికి కారణమవుతుంది.

ప్రసవానంతర థైరాయిడిటిస్ : ఇది చాలా అరుదైన పరిస్థితి, ఇది గర్భధారణ తర్వాత కొంతమంది తల్లిదండ్రులను ప్రభావితం చేస్తుంది. ప్రసవించిన తర్వాత సంవత్సరంలో 5% మంది దీనిని అనుభవించవచ్చని అంచనా. ఇది సాధారణంగా మొదట హైపర్ థైరాయిడిజానికి కారణమవుతుంది, తరువాత హైపోథైరాయిడిజానికి కారణమవుతుంది. ఇది సాధారణంగా తాత్కాలికమే.

థైరాయిడ్ వ్యాధి చాలా సాధారణం. యునైటెడ్ స్టేట్స్‌లో దాదాపు 2 కోట్ల మంది ప్రజలు ఏదో ఒక రకమైన థైరాయిడ్ పరిస్థితిని కలిగి ఉన్నారు.

మీకు థైరాయిడ్ వ్యాధి ఉంటే మీరు అనుభవించే లక్షణాలు చాలా ఉన్నాయి. దురదృష్టవశాత్తు, థైరాయిడ్ పరిస్థితి యొక్క లక్షణాలు తరచుగా ఇతర వైద్య పరిస్థితులు మరియు జీవిత దశల సంకేతాలకు చాలా పోలి ఉంటాయి. దీని వలన మీ లక్షణాలు థైరాయిడ్ సమస్యకు సంబంధించినవా లేదా పూర్తిగా మరేదైనా సంబంధం కలిగి ఉన్నాయా అని తెలుసుకోవడం కష్టమవుతుంది. చాలా వరకు, థైరాయిడ్ వ్యాధి లక్షణాలను రెండు గ్రూపులుగా విభజించవచ్చు - థైరాయిడ్ హార్మోన్ ఎక్కువగా ఉండటం (హైపర్ థైరాయిడిజం) మరియు థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉండటం (హైపోథైరాయిడిజం) కు సంబంధించినవి. ఈ లక్షణాలు తరచుగా రెండు పరిస్థితుల మధ్య “వ్యతిరేకమైనవి”. ఎందుకంటే హైపర్ థైరాయిడిజం మీ జీవక్రియను వేగవంతం చేస్తుంది మరియు హైపోథైరాయిడిజం మీ జీవక్రియను నెమ్మదిస్తుంది.

# నత్తనడకన బలహీన వర్గాల గృహ నిర్మాణాలు!

## గడువు దాటినా.. లక్ష్యాన్ని చేరుకోని వైనం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో బలహీనవర్గాల గృహ నిర్మాణాలు ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కు.. అన్న తీరున సాగుతున్నాయి. ఫలితంగా పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై, అసంపూర్తిగా వున్న 43,948 ఇళ్లలో గత ఏడాది అక్టోబరు నెలాఖరులోగా 13,687 ఇళ్లను పూర్తి చేయాలని నియోజకవర్గా వారీగా లక్ష్యాలను పెట్టుకున్నారు. కానీ ఇంతవరకు 9,520 గృహ నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. గత ప్రభుత్వ పాలకులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 608 లేఅవుట్లు వేసి, ఇళ్లు లేని వారికి సెంటు చొప్పున అందజేశారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు మంజూరయ్యాయి. అయితే ప్రభుత్వం ఇచ్చిన నిధులు చాలకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను మధ్యలో ఆపేశారు. గత ప్రభుత్వ హయాంలో 62,488 గృహాలు మంజూరుకాగా, ఆ ప్రభుత్వం దిగిపోయేనాటికి 18,500 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తియ్యాయి. 43,948 గృహాలు అసంపూర్తిగా వుండిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. అంతేకాక ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున అదనంగా ఆర్థిక సాయం అందించింది. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అంతేకాక అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. మొత్తం 43,948 ఇళ్లలో 13,687 ఇళ్లను 2025 అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించింది. కానీ ఎక్కడా అనుకున్న మేర పనులు జరగడంలేదు. గడువు ముగిసి నాలుగు నెలలు దాటినప్పటికీ ఇంతవరకు 9,520 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 4,167 ఇళ్ల పనులు కొంతమేర జరిగి, ఆగిపోయాయి.

అనకాపల్లిలో 2,754 అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంకాగా 1,635 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. చోడవరంలో 1,649 ఇళ్లనుగాను 1,209 ఇళ్లు, మాడుగులలో 2,090 ఇళ్లకు 1,638 ఇళ్లు, నర్సీపట్నంలో 2,404 ఇళ్లకుగాను 1,829 ఇళ్లు, పాయకరావుపేటలో 2,988 ఇళ్లకుగాను 2,112 ఇళ్లు, ఎలమంచిలిలో 1,212 ఇళ్లకుగాను 768, పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాల్లో 580 ఇళ్లకుగాను 329 ఇళ్లు పూర్తయ్యాయి. చాలాచోట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడం, గృహ నిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదని తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి, లక్ష్యంమేరకు పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కూటమి పార్టీలకు చెందిన నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇరాన్‌పై దాడిని ఖండించాలి: రాఘవులు



**విజయవాడ, పతాకం న్యూస్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గంగా జరుపుతున్న దాడిని కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి, ప్రతిపక్ష వైసిపి ఖండించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు కోరారు. మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బి.వి.రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కూటమి దాడిని సిపిఎంగా తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు. అధికారంలో భాగస్వామిగా ఉన్న టిడిపి, కేంద్రంపై ఒత్తిడి చేయకుండా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అన్ని విధాలా మద్దతు ఇస్తున్న ప్రతిపక్ష వైసిపి కూడా దీనిపై స్పందించ లేదన్నారు. ప్రధాని మోడీ ఇజ్రాయిల్ నాయకత్వంతో మాట్లాడి వచ్చిన తరువాతే ఇరాన్‌పై దాడి జరిగిందని, దాడి గురించి ముందే మోడీకి తెలిసి ఉండాలని అన్నారు. బలమైన నిఘా వ్యవస్థ ఉందని చెబుతున్న కేంద్రం దీన్ని ఎందుకు పసిగట్టలేకపోయిందో చెప్పాలన్నారు. లేక దాడి విషయం ముందే తెలిసి ఇజ్రాయిల్ ప్రధానిని కలిశారా? అదైనా బయటపెట్టాలన్నారు. ఇరాన్ అన్ని సందర్భాల్లోనూ భారత దేశానికి మంచి మిత్రుడిగా ఉందని, అయినా ఆ దేశ అధినాయకుడిని చంపేస్తే స్పందించకుండా యుఏఈలో అమెరికా ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశారనే అంశంపై మాత్రమే స్పందించడం అన్యాయమని తెలిపారు. ఇరాన్‌పై దాడితో ప్రపంచ ఆర్థిక పరిస్థితి ముఖ్యంగా ఇండియా పరిస్థితి దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడిని నిలిపేయాలని అన్ని దేశాలూ డిమాండు చేయాలని అన్నారు. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, సఫలమవుతున్నాయని అనుకున్న సమయంలోనే అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేసి చర్చలకు విఘాతం కలిగించాయని అన్నారు. అప్రజాస్వామికంగా స్కూళ్లపై దాడిచేసి విద్యార్థులను చంపేసిందని తెలిపారు. తమపై దాడి చేస్తారనే ఉద్దేశంతోనే తాము దాడిచేశామని ట్రంప్ చెబుతున్న మాటలు అబద్ధాలని, ఇరాన్ అటువంటి ఆలోచనలు చేయడం లేదని పెంటగాన్ నివేదిక తెలిపినా దాడి చేశారని తెలిపారు. అయితే మోడీ దెబ్బతినిపోతున్న ఇరాన్ తరుపున కాకుండా దాడి చేస్తున్న దేశం తరుపున – మిత్రులు, శత్రువులకు తేడా తెలియకుండా వ్యవహరించారని అన్నారు. ఈ విషయంలో అమెరికా వ్యూహంలో మోడీ భాగస్వామ్యం అయ్యారని, ఇజ్రాయిల్ తరుపున స్పందించి దేశ ప్రతిష్టను దిగజార్చారని తెలిపారు.




# ఇంగాండ్-భారత్ సెమీస్ పోరు రసవత్తరంగా ఉంటుంది: గవాస్కర్



పొట్టి ప్రపంచ కప్ 2026లో భాగంగా ఇప్పటికే సూపర్ 8 నుంచి నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా-న్యూజిలాండ్, వాంఖడే స్టేడియం వేదికగా ఇంగ్లండ్-భారత్ జట్లు తలపడనున్నాయి. ఈ కీలక పోరుపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా కచ్చితంగా ఫైనల్ వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. 'భారత క్రికెట్‌లో ఇది కొత్త యుగం.. ఇప్పుడు ఆడేది కొత్త జట్టు. గత రికార్డులను మరిచిపోవాలి. వాంఖడేలో భారత్‌కు సెమీ ఫైనల్స్‌లో అంత గొప్ప రికార్డు లేదు. కానీ ఈ టోర్నీలో టీమిండియా చరిత్ర సృష్టిస్తుంది. సెమీస్‌లో గెలిచే సామర్థ్యం ప్రతి ఒక్క ప్లేయర్‌లోనూ కనిపిస్తుంది. మరోవైపు ఇంగ్లండ్ జట్టు కూడా చాలా బలంగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్, మిడిల్ ఆర్డర్, ఫినిషర్లు.. అన్నింటిలోనూ ఇరు జట్లు సమానంగా ఉన్నాయి. కాబట్టి ఈ సెమీస్ పోరు అత్యంత రసవత్తరంగా సాగనుంది' అని సన్నీ వెల్లడించాడు. సెమీ ఫైనల్ మ్యాచ్ నేపథ్యంలో టీమిండియాకు సన్నీ కీలక సూచనలు చేశాడు. 'పవర్ ప్లేలో దూకుడుగా ఆడటం అవసరమే. కానీ ప్రతి బంతినీ బౌండరీ బాదాల్సిన అవసరం లేదు. పరిస్థితులకు అనుగుణంగా గేర్ మార్చాలి. మొదట కాస్త క్రీజులో కుదుర్కొని ఆపై దూకుడు పెంచాలి. తమ బలాలను గుర్తించి ఆడాలి. ఎప్పుడూ అటాకింగ్ మోడ్‌లో ఉండాల్సిన అవసరం లేదు. ఒక్క చిన్న తప్పిదం కూడా మ్యాచ్‌ను మలుపు తిప్పేస్తుంది' అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు.

## ఇంగ్లాండ్‌తో జరిగే సెమీఫైనల్‌లో

# గెలుపు కోసం టీమిండియా కసరత్తు




అంచనాలకు తగ్గ ఆటతీరుతో టీమిండియా టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో అడుగుపెట్టింది. ఇక గురువారం వాంఖడే మైదానంలో జరిగే రెండో సెమీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది. అయితే ప్రత్యర్థిని ఓడించి తుది పోరులోకి అడుగుపెట్టాలంటే శక్తికి మించిన ఆటతీరును చూపాల్సి ఉంటుందని ప్రధాన కోచ్ గౌతం గంభీర్ భారత ఆటగాళ్లను హెచ్చరించాడు. అలాగే వెస్టిండీస్‌పై చెలరేగిన సంజూ శాంసన్‌ను ప్రత్యేకంగా కొనియాడాడు. 'ఇంగ్లండ్ వరల్డ్ క్లాస్ టీమ్. జట్టులో ప్రతిభ కలిగిన ఆటగాళ్లకు కొదవలేదు. వాంఖడేలో జరగబోయే మ్యాచ్‌కు ఎంతటి ప్రాధాన్యముందో మనకు తెలుసు. అందుకే జట్టు కోసం, దేశం కోసం మరో అద్భుతం చేసేందుకు మనందరికీ దక్కిన అవకాశంగా దీన్ని భావించాలి. ఇందుకోసం జట్టు నుంచి మెరుగైన ప్రదర్శన వస్తుందనే ఆశిస్తున్నా' అని గంభీర్ తెలిపాడు. ఇక శాంసన్ నైపుణ్యంపై తనకు ఎలాంటి సందేహాలు లేవని, తనో అత్యుత్తమ ఆటగాడంటూ గౌతీ పేర్కొన్నాడు. అందుకే అతనికి మద్దతుగా నిలిచామని, విండ?సపై తన సత్తా ఏంటో చూపి జట్టును ఆదుకున్నాడని చెప్పాడు.

టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో భారత్-ఇంగ్లండ్ జట్లు ఇదివరకు రెండుసార్లు సెమీఫైనల్స్‌లో తలపడ్డాయి. గురువారం ముచ్చటగా మూడోసారి ఫైనల్లో చోటు కోసం బరిలోకి దిగబోతున్నాయి. అయితే 2022లో తొలిసారి తలపడినప్పుడు భారత్‌ను ఓడించిన ఇంగ్లండ్ ఫైనల్లో ప్రవేశించింది. అలాగే టైటిల్ పోరులో పాక్‌ను చిత్తు చేసింది. ఇక 2024లో జరిగిన సెమ?సలో మాత్రం రోహిత్ నేతృత్వంలోని టీమిండియా ఇంగ్లండ్‌ను మట్టికరిపించి, ఫైనల్లో సఫారీలను ఓడించి విజేతగా నిలిచింది. మరో విశేషమేమిటంటే.. ఈ రెండుసార్లు కూడా ఈ రెండు జట్ల మధ్య సెమ?సలో గెలిచిన జట్టే చాంపియన్‌గా అవతరించింది. ఇక వాంఖడేలో ఇంగ్లండ్ ఇప్పటివరకు ఆరు టీ20లు ఆడి 3-3 రికార్డుతో ఉంది. అటు భారత్ ఏడు మ్యాచ్‌లు ఆడి 5 నెగ్గింది. చివరిసారిగా మన జట్టు ఇక్కడ 2017లో ఓడడం గమనార్హం. అలాగే వాంఖడేలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన రెండు టీ20ల్లో చెరో విజయంతో సమానంగా ఉన్నాయి. ఓవరాల్‌గా ఈ మెగా టోర్నీలో ఇరు జట్లూ ఐదుసార్లు తలపడగా.. భారత్ 3-2తో ఆధిక్యంలో ఉంది. ఓపెనర్ సంజూ శాంసన్ ఒంటిచేత్తో భారత్‌ను టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌కు చేర్చాడు. అయితే, అంతకుముందు ఫామ్ కోల్పోయిన సంజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తుది జట్టులో కూడా చోటు కష్టంగా మారింది. కానీ, అదృష్టవశాత్తూ దక్కిన అవకాశాన్ని సంజూ ఈసారి ఒడిసిపట్టుకొన్నాడు. ఈ నేపథ్యంలో ఫామ్ కోల్పోయి ఇబ్బందులు పడుతున్నప్పుడు తాను సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉన్నట్టు శాంసన్ తెలిపాడు. ఎన్నోసార్లు నిరాశే ఎదురైనా.. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదని చెప్పాడు. 'షాట్ సెలెక్షన్‌పై ఎక్కువగా దృష్టిసారించా. కానీ, నా ఆటలో పెద్దగా మార్పులు చేయలేదన్నాడు.




# 'పెద్ది' సినిమా నుంచి రెండో పాట రిలీజ్..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. ఈ సినిమా నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న రెండో పాట 'రై రై రా రా' విడుదలైంది. ఇప్పటికే రిలీజైన మొదటి పాట 'చికిరి' మంచి విజయం సాధించగా, ఈ రెండో సింగిల్ కూడా చార్ట్ బస్టర్‌గా నిలిచే లక్షణాలు కనిపిస్తున్నాయి.

దిగ్గజ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఈ గీతానికి అనంతశ్రీరామ్ సాహిత్యం అందించాడు. ఈ పాటను ఏఆర్ రెహమాన్ స్వయంగా ఆలపించడం విశేషం. పక్కా మాస్ బీట్, హీరో ఎలివేషన్ థీమ్‌తో సాగే ఈ పాటలో ఇంటెన్స్ ఫోక్ పెర్కషన్ హైలైట్‌గా నిలిచింది. గ్రామీణ నేపథ్యంలో సాగే విజయ గీతంలా ఇది రూపొందింది. ముఖ్యంగా 'రై రై రా రా' అనే హుక్ లైన్ వినగానే ఆకట్టుకునేలా ఉందని, థియేటర్లలో ఈ పాటకు రెస్పాన్స్ గట్టిగా ఉంటుందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

ఈ చిత్రంలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొన్ని షూటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ముందుగా ప్రకటించినట్లే ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ స్పష్టం చేసింది. చికిరి తర్వాత వచ్చిన ఈ మాస్ నంబర్ మెగా ఫ్యాన్స్‌లో ఫుల్ జోష్ నింపింది.

# సూర్య కొత్త సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా మమిత బైజు హీరోయిన్ గా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం 'విశ్వనాథ్ ఢ సన్స్'. నేడు మేకర్స్ వదిలిన ఫస్ట్ లుక్ ఇంకా టైటిల్ పోస్టర్ కి మంచి రెస్పాన్స్ ఆడియెన్స్ నుంచి వచ్చింది. అయితే తెలుగు ఆడియెన్స్ మొదట కొంత డిజప్పాయింట్ అయినప్పటికీ తర్వాత మేకర్స్ తెలుగులో కూడా వదిలారు.



ఇక లేటెస్ట్ గా సినిమా నుంచి సెకండ్ లుక్ పోస్టర్స్ కూడా తెలుగు ఇంకా తమిళ్ లో బయటకి వచ్చాయి. వీటిలో మాత్రం సూర్య డెఫినెట్ గా ఒక పర్ఫెక్ట్ ఫ్యామిలీ మ్యాన్ రోల్ లో అలరించనున్నారని అనిపిస్తుంది. తన కొడుకుని తన వర్క్ టేబుల్ మీద పెట్టుకొని సూర్య కనిపిస్తున్నారు.

చాలా సింపుల్ లుక్స్‌తో బ్యూటిఫుల్‌గా ఈ పోస్టర్ కనిపిస్తుంది. మరి వెంకీ అట్లూరి సూర్యతో ఏం ప్లాన్ చేస్తున్నారో కానీ ఒక క్లీన్ ఎంటర్టైనర్ ని అందిస్తున్నారని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మాణం వహిస్తున్నారు.




# తన జీవితంలో చోటుచేసుకున్న చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్న స్నేహ



తెలుగు వెండితెరపై తనదైన అభినయంతో హోమ్లీ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నటి స్నేహ, తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒక భయంకరమైన ప్రమాదం గురించి సంచలన విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన ఈమె, అంతకు ముందే ఒకానొక దశలో తన సినీ ప్రయాణం ముగిసి పోయిందని భావించినట్లు వెల్లడించారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలో జరిగిన ఒక ఘోర ప్రమాదం తన జీవితాన్ని తలకిందులు చేసిందని, ఆ సమయంలో పడిన వేదనను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు.ఆ ప్రమాదంలో కాళ్లు, చేతులు, వీపు భాగానికి తీవ్రమైన గాయాలయ్యాయని స్నేహ తెలిపారు. కనీసం మంచం మీద నుండి లేచి నిలబడాలన్నా ఎనిమిది నెలల సమయం పడుతుందని వైద్యులు చెప్పడంతో, ఇక తను కెమెరా ముందుకు రావడం అసాధ్యమని అనుకున్నానని చెప్పారు. సరిగ్గా అదే సమయంలో దర్శకుడు కరు వళనియప్పన్ 'పార్తిబన్ కనవు' (తెలుగులో 'అంజలి ఐ లవ్యూ') కథతో ఆమెను సంప్రదించారు. తాను కదలలేని స్థితిలో ఉన్నానని తెలిసినా, ఆ దర్శకుడు చూపిన నమ్మకం, ఇచ్చిన ప్రోత్సాహం తనలో కొత్త ఆశలు చిగురింపజేశాయని స్నేహ తెలిపారు. ఆ మొండి ధైర్యంతోనే కోలుకుని మళ్లీ మేకప్ వేసుకున్నానని, ఆ సినిమా తన కెరీర్‌ను మలుపు తిప్పిందని ఆమె వివరించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**